# బస్సులో

●

ఉదయం 7 గంటల బండికోసం కాసులు కుయ్యకుండా బయలుదేరి బస్‌స్టాండుకు వచ్చాను. అర్జంటుపని. వెళ్ళితీరాలి.

బస్సుకోసం కోటిమంది కూచున్నారు. ఫలితం సోమనాధుడికి తెలియాలి. స్టాండుకువచ్చే ప్రతికొత్త పాసింజరూ శత్రువులా కనపడుతున్నాడు.

దవనం జడలూ—సుద్దకూజాలూ,

కాగితం కట్టలూ—చంటిపిల్లల చంకలూ,

ఎక్కడినుంచో వచ్చి పడుతున్నాయి ఎగుమతికోసం.

బస్సు రాలేదు,

పేపరుమిల్లుచిమ్నీఅంత చుట్టలోంచి పొగఒదుల్తూ ఒక విగ్రహంవచ్చి నించుంది.

దాని చుట్టూజనం ప్రదక్షిణం చేసింది విగ్రహం ఒకసారి చుట్టతీసి ఉమ్మేసి ముందుకు నడిచింది.

జనం వెంబడించింది,

విగ్రహం కోరికలివ్వదురా అంటే ఈ పవిత్ర హిందూదేశంలో ఎవడునమ్ముతాడు?

అది కొన్ని టిక్కట్లూ, మరికొన్ని గొంతుకులూ, ఏకకాలంలో కోసి చేతులు కడుక్కుంది.

దుమ్మెత్తిపోస్తూ బస్సువచ్చి ఒగురుస్తూ నించుంది.

నాళి

ఎడాపెడా వందచేతులుచాపి దాహంఅంది. ఒక సోడా కొట్టు ఖాళీ. అబ్బ! బస్సుకెంతదాహం! యజమానుల పోలిక— కాబోలు.

"గెటిన్ గెటిన్"

"ఎక్కండయ్యా. ఎక్కండి"

'అబ్బ....కాలుతొక్కారండీ సార్"

'సారీ...."

'గళ్ళశారీ........ముందుసీట్లో సర్దుకుంది" జనాన్ని కారు గర్భంలోకి గిరవటేస్తున్నాడు కండక్టరు.

ఒక సిల్కులాల్చీమెడలో వాలుజడ .... ఎండు చేపల బుట్టలో ఒక బ్రాహ్మణ వితంతువూ వెళ్ళిపడ్డారు.

కష్టపడి టికెట్టు పుట్టించి కారుదగ్గర నించున్నాను. నాగరికత నలుగుతుందని భయం. ఎక్కలేక దిక్కులు.... చూస్తున్నాను.

'టాపుమీద ఎక్కండి'

అన్నాడొక కుశాగ్రబుద్ధి.

'బొగ్గులు బస్తాలు పైకివెళ్ళడం మంచిది" అన్నాను. శ్యామసుందరుడు జనంలో మునిగిపోయాడు.

" బాబూ....పైకివస్తే .... సర్దుకుందాం. మెత్తనివారికి కారులోనే కాదు....ప్రపంచంలోనే చోటు దొరకదు"

ఎవరీ ధర్మమూర్తి? నాగౌరవాన్ని లాలించి కితకితలు పెట్టినట్టయింది. ఒక్కమాటతో మనిషిని కదలకుండా పట్టుకోవచ్చు తెలివిఉంటే—

తలెత్తి చూశాను.

జేగురురంగు అంగరఖా ... 50 ఏళ్ల సాధువు చేయిచాచి సామాను కిటికీలోంచి అందుకుని లోపలపెట్టాడు.

మహానుభావుడు అనుకున్నాను.

సాధువుసగంతాను కూచుని తక్కినసగంలో నన్నిరికించాడు.

బస్సు నడుస్తోంది.

'చెన్నపట్నం చేరగానే రాస్తావుగదూ.

మంగళవారం రిహర్సల్. మంచిది. ఖులాసాగా తిరిగిరా జేబులో జాగర్త''. నా స్నేహితులు వెళ్ళిపోయారు.

బస్సు ఇష్టంలేని ఆడపిల్ల అత్తారింటికిలా స్టాండులోంచి గునిసి గునిసి బయలుదేరింది.

## 2

సాధువును పరకాయించాను.

తల జడలుగట్టి తల మెడమీద పడుతున్నది.పెరిగినగెడ్డం గుండెదాకా ఉంది. కనుబొమ్మలు బిరుసుగా బొద్దుగాఉండి దగ్గరికి లాగితే చూపుల్ని చురుకు చేస్తున్నాయి. కుడిచేతికి దేనివో ఎముక పూసలున్నాయి. రెండు కనుబొమ్మలూ కలిసేచోట లేచేసూర్యుడిలా పెద్ద కుంకంబొట్టు.

ఇదీ వేషం—

''వేషంవేస్తారా నాటకంలో—''

మీసం గెడ్డం చిట్టడవిలోంచి సాధువు మూతి మాటాడింది.

నాకు ఒళ్లుమండింది.

'తమరు దెయ్యాల్ని ఒదల గొడతారా?" అన బుద్ధి పుట్టిందిగాని, అతని ఉపకారం అనిపిచ్చిందికాదు. విననట్టు ఊరుకున్నాను.

నాముఖంలోని రేఖల్ని కనిపెట్టాడు గాబోలు— గట్టివాడు.

సాధువు గెడ్డం అడివి చిన్న నవ్వునవ్వి అంది

"రిహార్సు" అంటే నాటకం అనుకున్నాను బాబూ ఏమీ అనుకోకు.

ఏమిటో వెర్రిగాని నాయనా, ఈలోకం, బతూగూ, మాత్రం ఒక నాటకంలా లేదూ... చూడు ఆ ముందుసీట్లో కూచున్నాయన ఆషరాయి, కోటూతో, ఎంత బాధపడుతున్నాడో! వేసంకాలం! ఉక్కఅయినా ఆ ఇరుకు వేషంమాత్రం మానడు

నీకా ఖద్దరుబట్టలూ అంతే దేశాభిమానం. నాకీజేగురు గుడ్డలూనూ, వైరాగ్యం. అందరం వేషాల వాళ్ళమే........"

'సాధువు గట్టివాడే" అనుకున్నాను

బస్సు రెండు ఫర్లాంగులు వెళ్ళింది.

సాధువు మెల్లిగా కాలక్షేపం ఉపక్రమించాడు.

"ఈనిప్పురాలే కాలంలో దూరప్రయాణాలు కష్టం నాయనా. అయితే రాచకీయంగా తప్పదుమరి. ఉద్యోగమా బాబూ అక్కడ?"

" ఉద్యోగం కాదండి హుషారుకోసమే, సరదాగా తిరిగొద్దామని బయలుదేరాను"

బాగుంది బాబూ, చిన్నతనపు వుత్సాహం అలాంటిదే. "ప్రయప్రయాస" లుగూడా కనిపించవు...."

"నిజంగానండి. ఈప్రయాణాల్లో ఖర్చుకు అంతూదరీ ఉండదు కదిలితే రూపాయలు కరుగుతూండ వలసినదే. ఇంతెందుకండీ, ఇప్పుడు ఏభై రూపాయలు పట్టుకు బయలుదేరా ననుకోండి తిరిగి వచ్చేటప్పటికి చిల్లుగవ్వ ఉండదు."

"అంతే........అంతే...."

"అయితే ఒకిరుకొంచెం ముట్టజెబుతారు లెండి అది యీ, యాతాయాతాలకి చెల్లు."అని సంతృప్తిగా నవ్వి ఊరుకున్నాను.

"అదృష్టవంతుడవు బాబూ. నీముఖంలో మంచిలక్షణా లున్నాయి ఎక్కడికి వెళ్ళినా నీమాటకు విలువఉంటుంది. మాట కరుకుగాని, మనసు దూది. మాయ ఎరుగవు. నీ మెడకింద రేఖలలాంటివి. చెయ్యేదీ?"

ఊపిరి సలపకుండా మాట్లాడాడు

బైరాగులు, జ్యోతిషాలూ, వేదాంతం, వేరుముక్కలూ, అంటే తలకాయనొప్పి నాకు. కాని అతనిదగ్గర ఎందుకో మెత్తబడిపోయాను. నేనివ్వకుండానే బల్లకు ఆనించిన కుడిచెయ్యి తీసి నోరులేని ఆమూగ గీతల్లో నాపదవి, భాగ్యం, ఇల్లు,పిల్లలూ, చదవడం మొదలుపెట్టాడు.

నేను విన్నట్టు నటిస్తూ పరధ్యానంగా బస్సుపక్క పరిగెత్తే చెట్లనూ కాలవల్నీ చూస్తున్నాను.

మాకు పక్కగా బస్సుతాలూకు అగ్గిస్తంభందగ్గరకూచున్న సకేశివైశ్యవితంతువు చాలసేపటినుంచి సాధువుతో ఏదో చెప్పాలని చూసిచూసి నా జాతక పఠనం అయాక సాధువుతో అంది.

"బాబూ ఒక్కమనవి ఉంది"

యోగీశ్వరుడు అటువైపు తిరిగాడు.

వితంతువు వివరించింది.

"మాపిల్లదానికి నాలుగేళ్ళనుంచి ఒళ్ళు బాగాలేదు బాబూ. నిద్దర్లో లేచి ఏడుస్తుంది. అప్పుడేనవ్వి పాడుతుంది. మగవాళ్ల కనబడితే తిడుతుంది. ఆకాశంకేసి చూసి దండాలు పెడుతుంది. ఏమిటో తండ్రీ చిన్నపిల్లలకి పెద్దరోగాలు." అంది బెంగగా.

"పిల్ల వయస్సెంత?"

"ఎంతోనా బాబూ, అంతాపోగుచేసి 20 లేవు"

"మగని కేంపని తల్లీ?"

"అబ్బే— ఇంకా పట్నంలో చదువుతున్నాడు బాబూ. వైద్యమో ఏదో, ఇంకా నాలుగేళ్లుండాలిట" అంతా గ్రహించినట్టు సూచనగా ఒక పెద్దమూలుగు మూలిగి కళ్లుమూసుకుని తన పేపసంచీలో చెయ్యిపెట్టాడు.

వితంతువు చెబుతూనే ఉంది.

'ఎన్ని వైద్యాలండి. ఒకబైరాగి గాలిఅంటే నెల్లాళ్ళు పూజపెట్టి, రాగిరేకులు కట్టి.... ఏమీకార్యం........"

యోగిచేత్తో యేదో సంచిలోంచి తీసి ఆరంభించాడాడు "అది ఉంటే ఇంకేవమ్మా? ఏడవలేక పోయాడు. పూజలుకాదు. దొంగ బైరాగి ముండా కొడుకుల్ని నమ్మకండి. ఇదికేవలం మనస్సుకు సంబంధించిన రోగమమ్మా! మూలికావైద్యం చేయించాలి. ఈమూలిక నాటుబైరాగుల దగ్గరదొరికేదికాదు హిమవత్పర్వతాల్లో-అనగా మంచుతిని మంచుతాగి కొయ్యయిపోయేచోట

ఏళ్ల తరబడి తపస్సుచేసిన నావంటివాళ్లకుగూడా దొరకదు బ్రహ్మకపాలంలో ఉన్న మాగురువుగారు సంపాదించి "ఇది మాకెందుకూ ఎవరికేనా ఇయ్యి." అని నాకు దయచెయ్యగా సంచిలో ఉంచాను. సమయానికి పనికొచ్చింది. ఏమీలేదు; పిల్ల ఉలికిపడినప్పుడు కనబడేలా మూడుమాట్లు దిగదుడిచి తలకింద పెట్టండి. తెల్లవారేసరికి నవ్వుతూ లేస్తుంది. ఇందమ్మా అని ఒకమూలిక ఆమెచేతిలో ఉంచాడు.

ఆమె అందుకుని కళ్లకద్దుకుని కొంగున జాగ్రత్తపరచి, బొడ్డుకొంగులోనుంచి రెండు రూపాయలు తీసి సాధువుచేతిలో పెట్టింది. సాధువు పురుగుల్ని ముట్టుకున్నట్లు మునివేళ్ళతో రూపాయలు పట్టుకుని తేలిగ్గా నవ్వి అన్నాడు.

"పిచ్చితల్లీ! ఎందుకమ్మా నాకివి? ఏంచేసుగోను?

రోజుకొక్క నిమ్మకాయ, పుడిసెడు గంగచాలు. ఎక్కువ, డబ్బుమరిగిన బైరాగులికి........"

బస్సు రంయిమనివచ్చి త్రోవలో ఒంటెనదగ్గర ఆగింది.

ఒక కుష్ఠు బిచ్చగాడు "ఎన్నాళ్లుండిన ఇహసుఖములలో— కొన్నాళ్లేగద మనసా........" తత్త్వంపాడుతూ బస్సుచుట్టూతిరిగి సాధువు దగ్గర చెయ్యిచాచాడు.

సాధువు "ఓం సద్గురుబోధ" అని రెండు రూపాయలూ బిచ్చగాడి చేతిలో పెట్టాడు.

బిచ్చగాడి కళ్లు తిరిగాయి.

బస్సు యావత్తుజనం నివ్వెరపోయింది.

కోమటావిడ చెయ్యెత్తి దండంపెట్టింది.

నేనూ ఆశ్చర్యపడి ఇలాంటివాడు నూటికొక్కడు నిజమైన విరాగి ఉంటాడనుకొన్నాను.

సాధువు వినయంగా నిర్లిప్తంగా అన్నాడు.

'బాబూ నామనస్సుకుఇప్పుడు తెరిపి అయిపోయింది బస్''

'ధవళేశ్వరం ఇంకాఎంతదూరంఉందో'' సాధువు తనలో గొణుక్కున్నాడు

ఆయన దిగిపోతున్నాడంటే బస్సంతా వ్యసనపడ్డారు.

ధవళేశ్వరం వచ్చింది

సాధువు పేపసంచీ పుచ్చుకుని నిశ్శబ్దంగాదిగి గోదావరి గట్టుకు ఎదురుగాఉన్న కంకర కొండలవైపు నడచివెళ్లాడు

వైశాఖమాసపుఎండ చుర్రుమంటోంది. సోడాకుర్రాణ్ణిపిల్చి తృప్తిగాపుచ్చుకుని డబ్బులివ్వడానికి లాల్చీజేబులో చెయ్యిపెట్టాను.

శరీరం ముచ్చెమటలు పోసింది.

జేబులో పర్సులేదు!!

ఏభై రూపాయలు!

*　　*　　*

పక్క పోలీసు స్టేషనులోనుంచి నలుగురు పోలీసులు వచ్చి డ్రైవరుని అడిగారు.

"విశాఖపట్నం జైలునుంచి తప్పించుకుని పారిపోయి ఒక గజదొంగ బైరాగి వేషంతో ఈ ప్రాంతంలో తిరుగుతున్నాడనీ,

పట్టుకోమనీ, మాకు నిన్న టెలిగ్రాములు వచ్చాయి అప్పటినుంచీ ప్రతిబస్సూ తణిఖీచేస్తున్నాం ఇందులో ఎవరైనా—"అంటున్నారు.

బస్సు ముఖంలో నెత్తురు లేదు.

మండిపడి.........కంకర కొండల్ని

ఎర్రగా చూసింది.

---